
సాక్షి గుంటూరు
బుధవారం । 17 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 521.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 826.90 అడుగుల వద్ద ఉంది.



నృసింహుని పార్వేట మహోత్సవం

మంగళగిరి : లక్ష్మీనృసింహస్వామి మంగళవారం పార్వేట మహోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారు మేళతాళాలతో కనక తప్పెట్లతో వైభవంగా ఊరేగారు.

మహాశక్తి అలంకారంలో బండ్లమ్మ అమ్మవారు



పిట్టలవానిపాలెం : చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా అమ్మవారిని మహాశక్తిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

కోడి పందేలు నిరోధించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలు జరగకుండా నిరోధించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ కోడిపందేలపై న్యాయస్థానాల నిర్దిష్టమైన తీర్పులున్నాయన్నారు. కోడిపందేలు జరగకుండా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు వేసి పర్యవేక్షించాలన్నారు. నిబంధలనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కోడి పందేలు నిర్వహించే వారిని ముందుగా గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసు శాఖ, జీవ రక్షణ సంఘం, జంతు ప్రేమికుల సహకారంతో ముందు కెళ్లాలన్నారు. ఆదేశాలను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

పోలీస్ బదిలీలు

నగరంపాలెం: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లు, అనుబంధ విభాగాల్లో విధులు నిర్వర్తించే ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు (హెచ్‌సీ), కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరుగురు ఏఎస్‌ఐలు, 11 మంది హెచ్‌సీలు, 60 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

మూడు రోజులపాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో ఇక నుంచి మూడు రోజుల పాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీని మంగళవారం ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ నిన్నటి వరకు మంగళ, శుక్ర వారాల్లో మాత్రమే ఉండేదని ఇక నుంచి మంగళ, గురు, శనివారాల్లో ఉంటుందని ఆయన చెప్పారు. ఈ విభాగానికి ప్రతి ఓపీకి 80 నుంచి వంద మంది వరకు రోగులు వస్తున్నారని చెప్పారు. అందువల్ల రోజు మార్చి రోజు ఓపీ అందుబాటులో ఉంచాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఊపిరితిత్తుల ఓపీని కూడా ఉంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. మూడు రోజులు గ్యాస్ట్రో ఎంట్రాలజీ , మూడు రోజులు ఊపిరితిత్తులు ఓపీ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ఆయన వెంట గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్ఓడీ డాక్టర్ కవిత, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

మస్తాన్ దర్గా ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పట్నంబజారు: కుల, మతలకు అతీతంగా దశాబ్దులుగా జరుపుకుంటున్న గొప్ప పండుగ గుంటూరు మస్తానయ్య ఉరుసు మహోత్సవమని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్డులోని రెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి కార్యాలయంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించనున్న ఉరుసు మహోత్సవ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్, మస్తాన్ షా వలి దర్గా ధర్మకర్త రావి రామోహన్‌రావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దర్శనానికి భక్తులు తరలివచ్చారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మూడు రోజులు దుర్గమ్మ సన్నిధికి భక్తులు పోటెత్తారు. సర్వ దర్శనం, రూ.500 అంతరాలయ దర్శనం మినహా మిగిలిన రూ.100, రూ.300 క్యూలైన్లలో సాధారణ రద్దీ కనిపించింది.

నగరానికి పల్లె శోభ





సంక్రాంతి సంబరాల్లో భాగంగా మకర జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి విడదల రజిని, ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మకర జ్యోతిని దర్శించుకుంటున్న నగరవాసులు

- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కనుల విందుగా సంక్రాంతి సంబరాలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తిన ఎన్టీఆర్ స్టేడియం
- తరలివచ్చిన నగర ప్రజలు



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకులు శ్రీకృష్ణ, దామిని భట్ల తదితరులు



తిలకిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో రెండో రోజైన సోమవారం జరిగిన సంక్రాంతి సంబరాలు వీక్షకులకు కనువిందు చేశాయి. మొదటి రోజైన ఆదివారం జబర్దస్త్ బంద సభ్యులు ఇమ్మానుయేల్ చేసిన ఆనందో బ్రహ్మ కామెడీ షో, వెంకీ మంకీ టాకింగ్ డాల్, ఆనంద్ చే మిమిక్రీ, హాస్యవల్లరి, శాంతి స్వరూప్ ఆటపాట, కామెడీ టానిక్ ప్రేక్షకులను అలరించాయి. రెండోరోజు సోమవారం సినీ గాయని దామిని, మెలోడీ స్టార్ శ్రీకృష్ణ, ట్రిపుల్ ఆర్ ఫేం హారికా నారాయణ్, ఉమా నేహా, రవి జాకీ, డీటీఎస్ ఆనంద్‌లచే స్టార్ మ్యూజికల్ మస్తి డాన్స్ హంగామా జరిగాయి. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు హాజరై సంబరాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాలు పల్లె వాతావరణాన్ని నగరానికి తీసుకువచ్చిందన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా సంక్రాంతి సంబరాల్లో పాల్గొని సంబరాలు చేసుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. అనంతరం మకర సంక్రాంతిని పురస్కరించుకొని శబరిమలలో మకర జ్యోతిని లైవ్‌లో ప్రదర్శించి, ప్రాంగణంలో మకర జ్యోతిని వెలిగించారు.



మకర జ్యోతిని వెలిగిస్తున్న గ్రంధి కాంతారావు

భక్తిశ్రద్ధలతో మకరజ్యోతి దర్శనం

పాత గుంటూరు: గుంటూరు సంపత్ నగర్ అయ్యప్ప స్వామి దేవస్థానంలో క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకట సత్యలక్ష్మి కాంతారావు, లక్ష్మీ హైమావతి దంపతుల ఆధ్వర్యంలో మకరజ్యోతి దర్శన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం క్రేన్ ఫ్యాక్టరీ నుంచి వేలాది మంది భక్తులు ఊరేగింపుగా స్వామివారి ఆభరణాలను ఆలయానికి చేర్చారు. అర్చకులు విశేషంగా అలంకరించారు. సాయంత్రం 6.36 నిమిషాలకు స్వామి శరణ ఘోష నడుమ గ్రంధి కాంతారావు దంపతులు మకరజ్యోతి ప్రజ్వలన చేశారు. అదే సమయాన ఆకాశంలో స్వామి నక్షత్ర దర్శనం ఇచ్చారు. భక్తిగీతాల సంగీత విభావరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మకర జ్యోతి దర్శనంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారని తెలిపారు. దేవస్థానంలో జరిగిన మకరజ్యోతి దర్శన మహోత్సవం గుంటూరు చరిత్రలో మరపురానిదని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు, క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది, టంగుటూరి మణి, చక్కా శ్రీనివాసు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



చివరిరోజు నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దర్శకులు అనిల్ రావిపూడి, పక్కన మలినేని గోపిచంద్, నటుడు అజయ్‌ఘోష్ తదితరులు


ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

- ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు
- ముఖ్య అతిథులుగా సినీ దర్శకులు అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, నటుడు అజయ్‌ఘోష్

యద్దనపూడి: ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని అనంతవరం గ్రామంలో ఐదురోజుల పాటు నిర్వహించిన ఉభయ తెలుగురాష్ట్రాల నాటకపోటీలు సోమవారంతో ముగిశాయి. ముఖ్య అతిథులుగా సినీదర్శకుడు అనిల్ రావిపూడి, గోపిచంద్ మలినేని, సినీనటులు అజయ్‌ఘోష్, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు హాజరయ్యారు. ఈసందర్భంగా అనీల్ రావిపూడి మాట్లాడుతూ సినిమా రంగంతో సమానంగా నాటకరంగానికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాపరిషత్‌ల ద్వారా నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను అభినందిస్తూ, గౌరవించటం అభినందనీయమని కొనియాడారు. గోపిచంద్ మలినేని మాట్లాడుతూ నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. సినీనటుడు అజయ్‌ఘోష్ మాట్లాడుతూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆంకాక్షించారు. కళాపరిషత్ నిర్వాహకులు గుదే పాండురంగారావు, మద్దినేని జమరామకృష్ణ, గుదే తారక రామారావు, కొరిటాల వంశీకృష్ణ, పెదవల్లి వెంకటేశ్వర్లు, శివసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం', ద్వితీయ ప్రదర్శనగా తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి 'నిశబ్దమా నీ ఖరీదెంత ', తృతీయ ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారి 'కాపలా', ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా 'కపిరాజు' ఎంపికయ్యాయి.

అర్థవంతమైన నాటికలకే ఆదరణ

చినగంజాం (పర్చూరు): సమాజాన్ని ప్రభావితం చేసే అర్థవంతమైన నాటికలకే ప్రేక్షకాదరణ ఉంటుందని ప్రముఖ రంగస్థల, టీవీ నటుడు జెట్టి హరిబాబు అన్నారు. గత మూడు రోజుల నుంచి మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో జరుగుతున్న జాతీయస్థాయి కళానికేతన్ కళాపరిషత్ నాటిక పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. సోమవారం రాత్రి ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేశాయి. తొలి ప్రదర్శన అమరావతి ఆర్ట్స్, గుంటూరి వారి 'అమృతహస్తం' నాటిక చూపరులను ఆలోచింపజేసింది. ఒకే తల్లి కడుపున జన్మించిన అన్నా చెల్లెళ్ల మధ్య ఉండాల్సిన ప్రేమానురాగాలు కాలక్రమేణా తగ్గిపోతున్నాయనే ఇతివృత్తంతో నాటిక సాగింది. అనంతరం రసఝురి పొన్నూరు వారు ప్రదర్శించిన 'కాపలా' నాటిక ప్రస్తుత సమాజంలోని



అమృత హస్తం నాటికలోని ఓ సన్నివేశం

రక్షణ వ్యవస్థను మేల్కొలిపింది. పలు వ్యవస్థలు ప్రజలకు రక్షణ కల్పిస్తున్నా జరగవలసిన ఘోరాలు జరుగుతూనే ఉన్నాయని, రక్షణ తాలూకు ఆవశ్యకతను తెలియజేసే విధంగా నాటిక సాగింది. చివరిగా ప్రదర్శించిన 'వెన్నెల వచ్చింది' నాటిక 'ఇంద్రప్రస్థం' నాటికలతో పాటు చివరి రోజు మంగళవారం ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామ', 'రాజు గారి గోచి' నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

జాతీయస్థాయి టీ-20 విజేత బళ్లారి

- ఉత్కంఠభరితంగా ఫైనల్ మ్యాచ్
- 7 పరుగుల తేడాతో బళ్లారి విజయం
- బహుమతులు అందజేసిన ఎంపీ సురేష్, సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



బళ్లారి జట్టుకు ప్రథమ బహుమతిని అందజేస్తున్న ఎంపీ నందిగం సురేష్



రెండో బహుమతిని చిక్కోలు చీతాస్ జట్టుకు అందజేస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: పండగ వాతావరణం అంతా క్రికెట్ మైదానంలోనే ఉంది.. క్రికెట్ చూడటం కంటే ఆడటమే నాకు తనకు ఇష్టం అని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పానెం హనిమిరెడ్డీస్ జాతీయ స్థాయి టీ-20 క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పార్టీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ మనవాడు అని నన్ను ఆశీర్వదించి ఎంపీని చేసినట్లే, హనిమిరెడ్డిని కూడా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. క్రీడల్లో ఎవరూ గెలిచినా మనవాళ్లే గెలిచారనుకోవాలన్నారు. 2024లో రాష్ట్రంలో సీఎం జగనన్న పెనుతుఫాన్ సృష్టించనున్నాడన్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దమ్మున్న నాయకుడిని ఇన్‌చార్జ్‌గా నియమించారన్నారు. అద్దంకి నుంచి గెలిచిన అనంతరం ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ, అద్దంకి ప్రభుత్వ వైద్యశాలను 30 పడకల ఆసుపత్రి నుంచి 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు కృషిచేస్తారన్నారు. అనంతరం పానెం హనిమిరెడ్డి మాట్లాడుతూ తాను ఆటను ఆటగానే చూస్తానని, రాజకీయకోణంలో ఆలోచించనన్నారు. కొండమంజులూరులో ఈ స్థాయిలో క్రికెట్ పోటీలు జరుగుతాయని ఊహించలేదన్నారు. క్రీడలకు తన తోడ్పాటు ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. విజేత బళ్లారి జట్టుకు రూ. 6 లక్షలు, షీల్డ్‌ను ఎంపీ నందిగం సురేష్ ఇవ్వగా, బహుమతిని హనిమిరెడ్డి స్పాన్సర్ చేశారు. రెండో బహుమతిని చిక్కోలు చీతాస్‌కు రూ. 4 లక్షలు, షీల్డ్‌ను హనిమిరెడ్డి అందించారు. ఈ బహుమతిని వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి స్పాన్సర్ చేశారు. మూడో బహుమతిని జార్ఖండ్ జట్టుకు రూ. 2 లక్షలు, షీల్డ్‌ను కృష్ణారెడ్డి అందించారు. బహుమతిని క్లబ్ చైర్మన్ కరణం స్వామి స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మంగళవారం జరిగిన మ్యాచ్‌లు..

3వ స్థానానికి లెవన్ బ్రదర్స్ క్రికెట్ క్లబ్ (కామారెడ్డి), మస్తాన్ లెవన్ (జార్ఖండ్) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట టాస్ గెలిచిన కామారెడ్డి నిర్ణీత 20 ఓవర్లలో 10 ఓవర్లు ఆడి 10 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ 9.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 94 పరుగులు చేసింది. 3 వికెట్ల తేడాతో జార్ఖండ్ జట్టు విజయం సాధించి 3వ స్థానంలో నిలిచింది.

విజేతగా నిలిచిన బళ్లారి..

మధ్యాహ్నం జరిగిన ఫైనల్ మ్యాచ్ ఎంఏకే క్రికెట్ క్లబ్ (బళ్లారి), చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం) జట్ల మధ్య జరిగింది. ఈమ్యాచ్‌లో మొదట టాస్ గెలిచిన బ్యాటింగ్ ఎంచుకున్న బళ్లారి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. 7 పరుగుల తేడాతో బళ్లారి జట్టు విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా జరిగింది. చివరి 6 బంతుల్లో 20 పరుగులు చేయాల్సి ఉండగా ఆ జట్టు 13 పరుగులు మాత్రమే సాధించింది. దీంతో బళ్లారి విజయం సాధించింది.

ఫైనల్‌లో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లు..

సోమవారం మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ ఎంఏకే క్రికెట్ క్లబ్ (బళ్లారి), లెవన్ బ్రదర్స్ క్రికెట్ క్లబ్ (కామారెడ్డి) మధ్య జరిగింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బళ్లారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కామారెడ్డి 18.5 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. 51 పరుగులు తేడాతో బళ్లారి జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

- 2వ సెమీ ఫైనల్ మ్యాచ్ మస్తాన్ లెవన్ (జార్ఖండ్), చిక్కోలు చీతాస్ (శ్రీకాకుళం) మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ నిర్ణీత 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం 11.4 ఓవర్లలో 2 వికెట్లు నష్టానికి 134 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో శ్రీకాకుళం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మకం

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

అద్దంకి: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చరిత్రాత్మకమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అద్దంకి ఆర్ అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చరిత్రలో గుర్తుపెట్టుకునే విధంగా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్ల వ్యయంతో స్టాండింగ్‌తో కలుపుకొని 205 అడుగుల ఎత్తులో భారత దేశంలో కనీవిని ఎరుగని విధంగా విగ్రహాన్ని నిర్మించారని చెప్పారు. మూడు వేల మంది కూర్చునే విధంగా మల్టీ కన్వెన్షన్ హాల్, 20 వేల పుస్తకాలు కలిగిన లైబ్రరీ, బౌద్ధ భిక్షువులు ధ్యానం చేసుకోవడానికి ఒక హాలు, భోజన సదుపాయం కోసం మొదట్లో ఒక హోటల్, గ్రీనరీ ఫౌంటేన్‌లు వంటి ఎన్నో సౌకార్యలతో ఏర్పాటు చేశారని చెప్పారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ కొన్ని కులాలకే సంబంధించిన వాడు కాదని, ఆయన అన్ని సామాజిక వర్గాలకు సంబంధించినవాడుగా చెప్పడమే ముఖ్యమంత్రి ఉద్దేశమని చెప్పారు. ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీటీఎఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్యోతి శ్రీమన్నారాయణమూర్తి, ఏఎస్ డబ్ల్యూ యువ స్వరూప, జ్యోతి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

క్లుప్తంగా

మకరజ్యోతి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అచ్చంపేట: మకర సంక్రాంతి వేడుకలలో భాగంగా స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్లో సోమవారం సాయంత్రం 25కిలోల కర్పూరంతో మకర జ్యోతిని వెలిగించారు. మకర జ్యోతిని సందర్శించేందుకు మండల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు భజన కార్యక్రమాలు చేపట్టారు. 9 రకాల పూజా ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఘోషతో గ్రామం హోరెత్తింది. అనంతరం ఎత్తైన స్టాండ్‌పై 25కిలో కర్పూరంతో వెలిగించిన జ్యోతిని భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సుబ్రమ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉభయదాతలు, ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పెద్ద ఎత్తున భక్తులు వీక్షించారు. షష్ఠి, మంగళవారం కలిసి రావడంతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించడం అదృష్టంగా బావిస్తున్నామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి ఊరేగింపులో అర్చకులు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(ప్రభుత్వరంగ బ్యాంకు) (ప్రాయోజిత బ్యాంకు - యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)
ప్రధాన కార్యాలయము : రఘుమేన్షన్, 4/1, బ్రాడీపేట, గుంటూరు-522002.

ఉద్యోగం నుండి తొలగించుట- తుది ఆదేశాలు

శ్రీ లలిత్ కుమార్, ఆఫీసర్ స్కేల్-2 (సస్పెన్షన్ లో ఉన్నారు), ఉద్యోగి కోడ్ సంఖ్య : 1086, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, చర్లగుడిపాడు(7085) శాఖ, నరసరావుపేట రీజియన్ పరిధి -
నివాస చిరునామా : శ్రీ లలిత్ కుమార్, డోర్ నెం.4-4-224, ఓ-27, పార్వతిబాయి BLDG, ఇందర్బాగ్, సుల్తాన్ బజార్, కోటి, హైదరాబాద్, పిన్ కోడ్ : 500095, తెలంగాణ రాష్ట్రం.
శ్రీ లలిత్ కుమార్, ఆఫీసర్ స్కేల్-2, ఉద్యోగి కోడ్ సంఖ్య : 1086, చర్లగుడిపాడు(7085) శాఖలో బ్యాంకు మేనేజర్ గా పనిచేస్తున్నప్పుడు సంబంధిత అధికారి అనుమతి లేకుండా బ్యాంకు విధులకు గైర్హాజరు అయిన కారణంగా 06-10-2023 న బ్యాంకు నుండి సస్పెండ్ చేయబడ్డారు.
ఈ విషయం మీద విచారణ జరిపి క్రమశిక్షణా అధికారి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు(అధికారులు మరియు ఉద్యోగులు) సేవా నిబంధనలు, 2010 లోని నిబంధన 39(1)(b)(iv) మరియు 2(g) కు లోబడి ఈ క్రింది ప్రధాన శిక్షను విధించారు:
"భవిష్యత్తు ఉపాధికి అనర్హత కల్పించకుండా బ్యాంకు ఉద్యోగం నుండి తొలగించుట".
పైన తెల్పిన ప్రధాన శిక్ష యొక్క తుది ఆదేశాలను రిజిస్టర్ పోస్ట్ ద్వారా పైన తెలిపిన నివాస చిరునామాకు 04-01-2024 తేదీన పంపడం జరిగింది. అది మీకు అందలేదు మరియు మా చిరునామాకు తిరిగి వచ్చినది.
ఈ కారణము చేత పత్రికాముఖంగా మీకు తెలియచేయడమైనది.
స్థలం:గుంటూరు
తేది:10-01-2024
సం/- టి. రామేశ్వరరావు, ఛైర్మన్ & క్రమశిక్షణా అధికారి,
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ప్రధాన కార్యాలయం, బ్రాడీపేట, గుంటూరు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ సంక్రాంతి శుభాకాంక్షలు: గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్ ప్లాట్స్ అ/కొ. సం: 9848986831. మీ మన్నెం లతీష్ గౌడ్

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గోర్లవారి పాలెంలో తక్షణమే గృహ నిర్మాణానికి అనువైన లేక్ వ్యూతో సుందరమైన CRDA అప్రూవల్ ప్లాట్స్ కలవు. 80% బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ఫోన్ : 9193813999

HOUSE FOR SALE

■ అమరావతి రోడ్డులో వెంగళరావునగర్ నందు గవర్నమెంట్ ధర 36లక్షలు కలిగిన సింగిల్ బెడ్‌రూమ్ హౌస్ కేవలం 23లక్షలకే అమ్మబడును. 9440328889, 9440328889

PLOT FOR SALE

■ గుంటూరు మున్సిపాలిటీ పరిధిలోని 160 గజముల నివాస గృహములకు మధ్య స్థలము తూర్పు దిక్కు మరియు రాగసీమ, జాయింట్ సౌకర్యముతో అతి తక్కువ ధరకు అమ్మబడును. 9493180043

SERVICES

DOCUMENT MISSING

■ I,LAVU SRINIVASA RAO S/o VEERA BHADHARA RAO Would Like to Inform The General Public That I Have Lost The Original Sale Deed Document ie., (1) 2996/2012, (2)3964/2015, (3)5994/2012 Near Mangalagiri Bus stand If Any One Found Kindly Contact ✆ 77993 63123

WANTED

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు పనిచేయుటకు స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, జీతం: 13500 - 25000+ వసతి సౌకర్యం కలదు. Cont: 9/3 అరండల్‌పేట,గుంటూరు. 9392008989, 9490578735

■ గుంటూరులోని హాస్పిటల్‌లో నర్సింగ్ స్టాఫ్, లేడీ రిసెప్షనిస్ట్, 10th పాస్ అయిన యువకులు, ఆయాలు మరియు PROలు కావలెను. సంప్ర: 7997777108

■ సువర్ణటిర్ నందు పనిచేయుటకు ఎంప్లాయిస్ M/F కావలెను. జీతం:13,500-27000/- వరకు అర్హత: 10th-డిగ్రీ, ఆఫీసు: అరండల్‌పేట, 9/3, గుంటూరు. ✆ 9550663111, 7095838563

■ LTD కంపెనీలో రిసెప్షన్స్, కంఙవరేటర్స్, టెలికాలర్స్, అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, ఆఫీస్‌బాయ్స్, హెల్పర్స్. Q: 10th-PG, జీ:10-25 వేలు. సంప్ర: 79939 76590

■ సేల్స్‌మెన్స్, హెల్పర్స్ కావలెను. మమత మెడికల్స్, గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద గుంటూరు. సంప్ర: 0863-2224688, 9885182923

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926

■ Wanted B-pharmacy or D-pharmacy candidates to Work in a pharmacy in Guntur city.PCI Certificate Registration mandatory. Conatact: 63009 75241

■ ఉచితంగా కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ ఎలక్ట్రీషన్ & బ్రాడ్‌బ్యాండ్ టెక్నీషియన్ కోర్సును నేర్పించి ఉద్యోగం చూపించబడును. ఉచిత వసతి+భోజనం. వ:18-35సం॥, గుంటూరు. ✆ 9133444985/ 89

■ గుంటూరు నగరంలోని రిలయన్స్ ఇన్సూరెన్స్ కంపెనీకు చెందిన మహిళ బ్రాంచ్‌లో వివాహిత మహిళలకు ఉద్యోగ అవకాశం. Q:Any Degree, Age: 30-40y, S: 12k+ Inc 7500 PM. 9348366867, 8639088896

■ యడ్లపాడు,తిమ్మాపురం హైవే ప్రక్కన ఉన్న భారత్ పెట్రోల్‌బంక్ నందు పనిచేయుటకు మేనేజర్స్ / సూపర్‌వైజర్స్ & పంప్ బాయ్స్ /గర్ల్స్ అర్జెంటుగా కావలెను:8885033198

■ గుంటూరు సిటీలో అనుభవం గల సెక్యూరిటీ గార్డులు & హౌస్ కీపింగ్ వారు (M/F) కావలెను Age: 50 సం.లోపు. ఆసక్తి గల వారు సంప్ర ✆ 8008 545 666, 751 9999 555

■ సత్యం హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp.స్త్రీ/పురుషులు/నర్సులు కావలెను. జీతం:18000/- నుండి 24000/-వరకు ఇవ్వబడును. HYD లో. 6302532832 / 8019117633.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... పాఠకులు గమనించగలరు.

ఘనంగా ఏఈఎల్ సీ యూత్ కన్వెన్షన్



యూత్ కన్వెన్షన్ లో బిషప్ లతో ఏ ఈ ఎల్ సీ బిషప్ పర దేశి బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘ (ఏ ఈ ఎల్ సీ) యూత్ కన్వెన్షన్ -2024 సోమవారం గుంటూరు లోని ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రాంగణంలో ప్రారంభించబడింది. ఈ సందర్భంగా ఏ ఈ ఎల్ సీ బిషప్ మోస్ట్ రెవరెండ్ కే ఎఫ్ పరదేశి బాబు, ఎన్ సీ సీ ఐ ప్రధాన కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ ఆశిర్ ఎబినేజర్, యూత్ కన్వెన్షన్-2024 కన్వీనర్ కె. రవితేజ, ఏ ఈ ఎల్ సీ ప్రథమ మహిళ ఆశా కిరణ్ పరదేశి బాబు జ్యోతి ప్రజ్వలనం తో ప్రారంభించారు. యూత్ కన్వెన్షన్ కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రెండు వేల మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువజనుల ఐడెంటిటీని సంఘం నుంచి పొందటం ముఖ్య ఉద్దేశంగా బిషప్ ప్రసంగించారు. ఏ ఈ ఎల్ సీ కార్యదర్శి చెన్నం కిషోర్, కోశాధికారి మోజస్ ఆర్నాల్డ్, ఆరు సెనెడుల బిషప్స్, కౌన్సిల్ మెంబర్స్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ పి. లీలా బోసు, ఏ ఈ ఎల్ సి యూత్ ఇవాంజెలిస్ట్ రెవరెండ్ శ్రీకాంత్ జేమ్స్ ఆర్ ఆర్ కే, ఏ ఎల్ సి యూత్ మినిస్ట్రీ ఇన్ చార్జ్ రెవరెండ్ సతీష్, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే మోజెస్ పాల్గొన్నారు. 'బైబుల్ క్రిస్టియన్ ఐడెంటిటీ' పై రెవరెండ్ కే జాన్ విక్రమ్, ఫెయిత్ అండ్ క్రిస్టియన్ ఐడెంటిటీ' పై రెవరెండ్ డాక్టర్ ఐ కె మృత్యుంజయ, సెలబ్రేషన్ అండ్ క్రిస్టియన్ ఐడెంటిటీ' పై రెవరెండ్ డాక్టర్ చిలుకూరి వసంత రావు 'చారిటీ అండ్ క్రిస్టియన్ ఐడెంటిటీ' పై మిస్టర్ జాస్పర్ పాల్ మిస్సెస్ తెరిసా జాస్పర్ ప్రసంగించారు. పై అంశాలపై వక్తలతో యువతి యువకులు పై అంశముల చర్చించారు. మోడ్ రైటర్ బిషప్ డాక్టర్ కె.ఎఫ్ పరదేశి బాబు ఆధ్వర్యంలో ఏఈ ఎల్ సీ వరల్డ్ యూత్ కాన్ఫరెన్స్ పోలాండ్, మ లేషియా దేశంలో పాల్గొన్న యువతీ, యువకులచే సేవ్ ఎర్త్ అను నినాదంతో ప్రతిజ్ఞ చేయించి ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. వీటితో పాటు ప్రముఖ క్రైస్తవ సంగీత టీం జాన్ ఎరిక్ బందం హైదరాబాద్ చే చక్కని పాటలు, కొరియన్ టీం చక్కని పాటలతో కొనసాగింది.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి



యర్రంవారిపాలెం (కారంచేడు): పండుగలు ఆధ్యాత్మికతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మనందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యర్రంవారిపాలెం ఆయన స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలసి సోమవారం సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. స్వగ్రామాలకు వెళ్లి స్థానికులు, చిన్ననాటి స్నేహితులతో కలసి సరదాగా పండుగలు జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు. గ్రామానికి చెందిన అనేక మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గ్రామంలో సరదాగా ఏర్పాటు చేసుకున్న వాలీబాల్ పోటీలను ఆయన సందర్శించారు. పోటీలను ఆయన ప్రారంభించి యువతతో మాట్లాడారు. విజేతలకు ఆయన బహుమతులు పంపిణీ చేశారు.

ప్రతి ఇంటా సంక్రాంతులు



బృందావన్ గార్డెన్స్ ఆలయంలో అభిషేకం చేస్తున్న విశ్వంజీ మహారాజ్



అరండల్ పేట శివాలయంలో మకర జ్యోతిని వెలిగిస్తున్న శ్రీధర్



మకర జ్యోతిని దర్శించుకున్న భక్తులు

- బంధువుల రాకతో పెద్ద పండుగ సందళ్లు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. మకర జ్యోతి దర్శనం
- పతంగులు ఎగురవేసి ఉత్సాహంగా గడిపిన పిల్లలు, పెద్దలు

పాత గుంటూరు: సంక్రాంతి పండుగతో గుంటూరు నగరానికి కొత్త శోభ వచ్చింది. మకర సంక్రాంతి, కనుమ పండగలను ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో మకర జ్యోతి దర్శనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి బంధువులు రావడంతో ప్రతి ఇంటా సందడి వాతావరణం నెలకొంది. రకరకాల పిండి వంటలతో ఘుమఘుమలాడాయి. తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి కావడంతో వస్త్ర కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. వీధుల్లో హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల కోలాహలం కన్పించింది. మహిళలు ఇంటి ముంగిట ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెట్టి రంగవల్లులను తీర్చిదిద్దారు. వీధిలకు వచ్చిన హరిదాసులు, గంగిరెద్దుల నిర్వాహకులు ప్రజలకు శుభాశీస్సులు పలికారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒక చోట చేరడంతో ఏడాదిగా జరిగిన విశేషాలను పంచుకుని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పిల్లలు, పెద్దలు పతంగులను ఎగరవేసి ఉత్సాహంగా గడిపారు. పలు సంస్థల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు పాల్గొని సందడి చేశారు.

ఆలయాల్లో....

బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో పన్నెండవ సద్ది అన్నప్రసాద కార్యక్రమాలు ముగిశాయి. సోమవారం సంక్రాంతి సందర్భంగా గంగిరెద్దుల విన్యాసం నిర్వహించిన వారికి సత్కారం, వినాయకుడు, అయ్యప్ప, శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వంజీ మహారాజ్ మకరజ్యోతి వెలిగించారు. విశేషంగా పాల్గొన్న భక్తులు ప్రత్యేకాలంకరణలో స్వామిని, మకరజ్యోతిని దర్శించుకుని సేవించుకున్నారు. ఆలయ అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు, ఉపాధ్యక్షులు లంక విజయబాబు, అచ్యుత రామయ్య, పుట్ట ప్రభాకరరావు పర్యవేక్షించారు.

ముగిసిన తొమ్మిదో మకరజ్యోతి దర్శన మహోత్సవాలు

స్థానిక మల్లారెడ్డినగర్ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామిదేవాలయం చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మకర జ్యోతి దర్శన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు గణపతి హోమంతో ప్రారంభించి అయ్యప్పస్వామికి నవకలశాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి ఆభరణాలను అయ్యప్ప నామస్మరణతో నగర వీధులలో నగరోత్సవంతో ఆలయానికి చేర్చారు. పదునెట్టాంపడి మెట్ల పూజ, డప్పు శ్రీను భజన కార్యక్రమాలు, అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. మహా హారతి అనంతరం అయ్యప్పలకు బిక్ష, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను, కొండారెడ్డి , సీత రామిరెడ్డి, గుంటూరు వేమారెడ్డి పర్యవేక్షించారు.

అరండల్ పేట శివాలయంలో..

అయ్యప్ప సేవా సమాఖ్య అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్, సిరిపురపు స్వరాజ్యలక్ష్మి మకర జ్యోతిని వెలిగించారు. ఉత్తరా నక్షత్ర దర్శనం అనంతరం జ్యోతి దర్శన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీ ధర్మశాస్త్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమం, స్వామివారికి పలు ఆభరణాలతో విశేష అలంకరణ, వేద ఘోష నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు, భజన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కర్ శర్మ , సుబ్రహ్మణ్యం, ఏకా ప్రసాద్, మన్నవ రాధాకృష్ణ , డి.యస్.బాబు, ధనేకుల మోహన్ రావు , అట్లు జయభారత్ రెడ్డి, మేళపూడి కరుణానిధి, యండపల్లి శబరి, సురేష్, డప్పు నాగేశ్వరరావు, అనీషా, శ్రీలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా శుభం కలగాలి

ట్రిపుల్ ఎక్స్ కంపెనీ చైర్మన్ అరుణాచలం మాణిక్య వేలు



కార్మికులకు సందేశం ఇస్తున్న మాణిక్య వేలు, పక్కన కుటుంబ సభ్యులు

తాడికొండ: తెలుగు ప్రజల అతిపెద్ద పండుగ సంక్రాంతి వేళ అందరి ఇళ్లలో పండుగ కాంతులు విరజిల్లాలని ట్రిపుల్ ఎక్స్ సబ్బుల కంపెనీ అధినేత అరుణాచలం మాణిక్య వేలు అన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలోని ట్రిపుల్ ఎక్స్ సబ్బుల కంపెనీలో నిర్వహించిన వేడుకలలో భాగంగా ఆయన కార్మికులతో కలిసి సంతోషంగా గడిపారు. అందరికీ శుభం కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని తాను తెలుగింటి సాంప్రదాయాలను గౌరవిస్తూ ప్రతి ఏటా తన కంపెనీలో పండుగలను నిర్వహించి కార్మికులతో కలిసి సంతోషాన్ని పంచుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తనకు ఆరోగ్యం సహకరించడం లేదని, ప్రతిఏటా అందరితో నడిచి సంతోషంగా గడిపేవాడినని కానీ ఈ పండుగకు భగవంతుడు కూర్చొని మీతో సంతోషం పంచుకోవడానికే పరిమితం చేశాడన్నారు. తనకన్న మిన్నగా కుమారుడు పర్విన్ బాబు, భార్య, కుటుంబం అంతా అందరినీ బాగా చూసుకుంటారన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు సాంప్రదాయ అరిసెలు, చక్రాలు పంపిణీ చేసి ఆత్మీయ విందులో కలిపి పంచుకున్నారు.

సినీ థియేటర్‌లో ఘర్షణ

ముగ్గురికి తీవ్ర గాయాలు



కొల్లూరు: సినీ థియేటర్‌లో సీట్లలో కూర్చునే విషయంలో తలెత్తిన ఘర్షణ చోటుచేసుకున్న ఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, ప్రేక్షకుల కథనం మేరకు.. స్థానిక వెంకటేశ్వర థియేటర్‌లో ఇటీవల విడుదలైన ఓ సినిమా సెకండ్ షోకు మండలంలోని సుగ్గునలంకకు చెందిన యువకులు సినిమాకు వెళ్లారు. థియేటర్ నిర్వాహకులు సినిమా హాలు సామర్ధ్యానికి మించి ప్రేక్షకులకు టికెట్లు అమ్మకాలు జరపడంతో ప్రేక్షకులు కూర్చునేందుకు సీట్లు దొరకలేదు. థియేటర్లో కూర్చునే అవకాశం లేకపోవడంతో సుగ్గునలంకకు చెందిన యువకులు థియేటర్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు సిబ్బంది థియేటర్ వద్దకు చేరుకొని థియేటర్‌లోని సిబ్బందిని ప్రశ్నించడంతో అదనపు సీటింగ్ ఏర్పాటు చేసి, ఇంటర్‌వెల్ వరకు అక్కడ కూర్చోవాలని అనంతరం ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కూర్చోవాలని సూచించారు. దీనికి సమ్మతించిన సుగ్గునలంక యువకులు విరామం అనంతరం ఖాళీగా కనిపించిన కుర్చిలో కూర్చోవడంతో అంతకుముందు నుంచి అక్కడ కూర్చున్న కొల్లూరు గౌడపాలెంకు చెందిన వ్యక్తి వచ్చి తన సీటులో లేవాలనడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో ఘర్షణ కాస్తా కొట్లాటగా మారడంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం కొల్లూరుకు చెందిన వ్యక్తులు కొట్లాట విషయం ఫోన్ల ద్వారా తమ మిత్రులకు సమాచారం అందించడంతో వారు బయట నుంచి కర్రలు, కత్తులు, రాడ్లతో థియేటర్‌లోకి ప్రవేశించి దాడికి తెగపడ్డారు. దాడిలో సుగ్గునలంకకు చెందిన సుగ్గున కేశవసాయి, గోన తరుణ్‌సాయి, గోన ఉదయ్‌లకు తీవ్ర గాయాలవడంతో 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. థియేటర్ తెర ధ్వంసమైంది. కొట్లాటలో గాయపడిన యువకుల ఫిర్యాదు మేరకు వైద్యశాల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరపనున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

రైతుభరోసా కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు

ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్త చెరుకూరి శ్రీనివాసరావు



శావల్యాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు మెరుగైన సేవలు పారదర్శకంగా అందుతున్నాయని ఆచార్య ఎన్‌జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్త చెరుకూరి శ్రీనివాసరావు అన్నారు. సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో మంగళవారం ఆయన స్వగ్రామం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ ప్రగతి సాధించటం ద్వారా విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు చేసుకునే స్థాయికి ఎదిగామన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉత్పత్తి అయిన వరి వంగడాలు భారత దేశంలో 40 శాతం మంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. రైతులు బాధ్యతగా పురుగుమందుల అవశేషాలు వినియోగించాలన్నారు. ముఖ్యంగా పొలాల్లో పురుగుమందుల అవశేషాలు పిచికారి చేసే వారందరు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆహార స్వయ సంవృద్ధిలో భాగంగా హరిత విప్లవం అమలు చేసి సురక్షితమైన ఆహార ఉత్పత్తులు సాగు చేస్తున్న ఘనత భారతదేశానికి దక్కుతుందన్నారు. 2010 నాటికి భారతదేశంలో 70 వేల మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులు వినియోగించారని, రైతుల్లో అవగాహన పెరగడంతో ప్రస్తుతం 50 వేల మెట్రిక్ టన్నులు ఎరువుల వినియోగించారన్నారు. రసాయనిక ఎరువులు మోతాదు తగ్గటం ద్వారా వాతావరణంలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగుమందుల అవశేషాలు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. నూతన వ్యవసాయ ఆధునీకరణ విధానాల ద్వారా ఆవిష్కరణ జరిగినట్లు చెప్పారు. దీని వలన తక్కువ మోతాదులో పురుగుమందులు అవశేషాలు వినియోగించవచ్చన్నారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ ధర్నా



చీరాల రూరల్: క్రీస్తు పుట్టుక గురించి అసభ్య పదజాలంతో దూషించిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలంటూ పాస్టర్లు, క్రైస్తవులు, దళిత సంఘాల నాయకులు మంగళవారం ఈపురుపాలెం పోలీసు స్టేషన్‌ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు గుమ్మడి యేసురత్నం, కంచర్ల చిట్టిబాబు, మార్పు దీనరాజు, దేటా దివాకర్, పలువురు పాస్టర్లు మాట్లాడారు. రెండు రోజులు క్రితం గవినివారి పాలెంలో సువార్త ప్రకటించి ర్యాలీగా వెళుతుండగా ఆ గ్రామానికి చెందిన గవిని అయ్యప్ప, మిండా వెంకట్రావు ఏసు క్రీస్తు పుట్టుకను తీవ్రమైన అసభ్య పదజాలంతో దూషించారని చెప్పారు. దీంతో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మంగళవారం క్రైస్తవులు, దళిత సంఘాల నేతలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఈపురుపాలెం ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను సాయంత్రం ఐదు గంటల లోగా అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సాయంత్రం 6 గంటలు దాటినా నిందితులను అరెస్టు చేయకపోవడంతో పాస్టర్లు, దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహాలు వ్యక్తం చేస్తూ వెదుళ్లపల్లి 216 జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ విషయమై డీఎస్పీ ప్రసాదరావును వివరణ కోరగా నిందితుల ఆచూకీ ఇంకా దొరకలేదని, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నామని చెప్పారు. నిందితుల బంధువులను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ చెప్పారు.

రామమందిర నిర్మాణం చిరకాల వాంఛ

దగ్గుబాటి పురందేశ్వరి



కారంచేడు: అయోధ్యలో రామ మందిర నిర్మాణమే భారతీయుల చిరకాల వాంఛ అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సోమవారం సంక్రాంతి పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి జరుపుకోవడానికి కారంచేడుకు వచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అయోధ్యలో శ్రీరాముల వారి మందిర నిర్మాణం ప్రతి భారతీయుడి కోరికన్నారు. అది మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదగా పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఆయన చేతుల మీదుగానే ఈ నెల 22వ తేదీన వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్యన జరగుతుండటం అదృష్టమన్నారు. అనంతరం స్థానిక శివాలయంలో ఆమె చీపురు పట్టి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పోతిన సుబ్బారావు పాల్గొన్నారు.

చెరువులో పడ్డ ఇద్దరు యువకులు

వేమూరు: ద్విచక్ర వాహనం చెరువులో పడి ఇద్దరు యువకులు గాయపడిన ఘటన జంపని గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసు తెలిపిన వివరాలు.. నిరంజన్, సూర్యభాస్కర్ తెనాలిలో ఓ హోటల్‌లో పనిచేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు చూసేందుకు వెళ్లారు. వేమూరు పరిసరాల్లో పందేలు చూసి రాత్రి 8గంటల సమయంలో బైక్‌పై తెనాలి వస్తున్నారు. జంపని చెరువు వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి చెరువులోకి వెళ్లిపోయింది. స్థానికులు గుర్తించి బయటికి లాగారు. 108లో తెనాలి ప్రభుత్వం వైద్య శాలకు తరలించారు. ఒడిశాకు చెందిన నిరంజన్ పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో గుంటూరు ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. విజయనగరం జిల్లా చెందిన సూర్యభాస్కర్‌కు తెనాలి ప్రభుత్వం వైద్య శాలల్లో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ ఎస్.నాగరాజు మంగళవారం తెలిపారు.

సంక్రాంతి కప్- 2024 విజేత చెన్నై



విజేత సౌత్‌సెంట్రల్ సీసీ చెన్నై క్రీడాకారులు, అతిథులు

ముగిసిన దక్షిణ భారత స్థాయి క్రికెట్ పోటీలు

మేదరమెట్ల: రావినూతల స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన 30వ టీ-20 క్రికెట్ టోర్నీ విజేతగా సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌కు చిక్కోల్ చీతాస్ శ్రీకాకుళం జట్టు హాజరు కాలేదు. మూడో విజేతగా నిలిచిన జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ ఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో సౌత్‌జోన్ సీసీ చెన్నై- జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జట్ల మధ్య ఫైనల్ నిర్వహించారు. మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో 12 ఓవర్లకు అంపైర్లు కుదించారు. టాస్ గెలిచిన సౌత్ జోన్ చెన్నై జట్టు బ్యాటింగ్ తీసుకొని నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. 126 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి కేవలం 114 పరుగులు మాత్రమే చేసింది. దీంతో సౌత్‌జోన్ సీసీ చెన్నై జట్టు గెలిచి సంక్రాంతి కప్, రూ.3లక్షల నగదు బహుమతిని గెలుచుకుంది. జీఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు రెండో స్థానంలో నిలిచి షీల్డ్, రూ.2 లక్షలు గెలుచుకోగా మూడో స్థానంలో శ్రీసీసీ చెన్నై జట్లు షీల్డ్, రూ.లక్ష నగదును గెలుచుకున్నారు. అలాగే బెస్ట్ బ్యాటర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ బౌలర్‌లుగా ఎంపికైన క్రీడాకారులకు కప్‌లను అందజేశారు.

తొలుత మూడో స్థానం కోసం మ్యాచ్

ఎస్‌టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) జట్ల మధ్య మూడో స్థానానికి పోటీ జరిగింది. తొలుత టాస్ గెలిచి శ్రీసీసీ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన జీసీఈ చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. అనంతరం 172 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ దిగిన శ్రీసీసీ చెన్నై జట్టు 18 ఓవర్లలో 106 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది.

30 ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయం..

ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా క్రికెట్ పోటీలను నిర్వహించడం అంటే అందరికీ అది సాధ్యమైన పనికాదని, అలాంటిది మూరుమూల గ్రామంలో అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రౌండ్‌ను పిచ్‌ను ఏర్పాటు చేసి పోటీలు నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. భ్రమర టౌన్‌షిప్ ఎండీ గల్లా రామచంద్రరావు మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను తమవంతుగా ప్రోత్సహిస్తామన్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో రమణమూర్తి, మురళీకృష్ణ, తిలక్, అసోసియేషన్ అధ్యక్ష్యుడు కారుసాల నాగేశ్వరావు పాల్గొన్నారు.